
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 23 అక్టోబరు 2025 | 5





అయినవిల్లి సిద్ది వినాయకుడి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కార్తీకం..ఆరంభం

రాజమహేంద్రవరం సిటీ/అమలాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి నదీతీరం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. బుధవారం వేకువజామున 2:30 గంటల నుంచి భక్తులు కోనసీమ జిల్లాలోని కోటిపల్లి, అయినవిల్లితోపాటు పలుచోట్ల, రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, పద్మావతి ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌ల్లో భక్తులు గోదావరి స్నానాలు ఆచరించారు. కుటుంబాలతో రేవులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో స్నానాలు చేశారు. రేవులో పిండిముగ్గు వేసి దానిలో పసుపు, కుంకుమ దిద్ది, తమలపాకులో పసుపుముద్దతో దేవుడి ప్రతిమ చేసుకుని పిండి ప్రమిదల్లో దీపం వెలిగించుకుని మహిళలు పూజ చేశారు. కార్తీక దీపాలను గోదావరినదిలో విడిచి పెట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో రేవులన్నీ కిక్కిరిశాయి. భక్తజనం రేవుల సమీపంలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద, నందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగించారు. జిల్లాలో ద్రాక్షారామతోపాటు పలు శివాలయాలు కార్తీక శోభతో ప్రజ్వరిల్లాయి.







రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



మూడేనా!

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఇంకా ఏడాదే



- ఆరునెలల ముందే ఎన్నికలు?
- ముగిసిన నాలుగేళ్ల పదవీకాలం
- మూడు జిల్లాలకు మూడు జడ్పీలు
- వచ్చే ఏడాది నుంచి ముక్కలు
- విభజిత జిల్లాల్లో సర్దుబాట్లు
- పశ్చిమ నుంచి 10 జడ్పీటీసీలు
- ఓటర్ల జాబితాలపై కుస్తీ
- ఎంపీడీవోలు, రెగ్యులర్ పోస్టుల భర్తీ
- ఇప్పటికే జడ్పీ ఆస్తుల విభజన పూర్తి
- ఆదాయాలపై నివేదికలు సిద్ధం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జడ్పీ విభజనకు సమయం ముంచుకొస్తోంది. వచ్చే ఏడాది నాటికి మూడు జిల్లాలకు మూడు జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కాబోతున్నాయి. ప్రస్తుత ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఏడాది మాత్రమే కాల వ్యవధి మిగిలి ఉండడంతో కొత్త జడ్పీల ఏర్పాటుపై తాజాగా ఉద్యోగ వర్గాల్లో చర్చ మొదలైంది. గత నెలతో ఉమ్మడి జిల్లా పరిషత్‌కు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయింది.మిగిలిన ఏడాది కాలానికి ఆరు నెలల ముందే ఎన్నికలు జరిగే అవకా శాలు కనిపిస్తున్నాయి. దీంతో తాజాగా అధికారులు విభజిత జిల్లాల ఆధారంగా ఓటర్ల జాబితా విభజనపై దృష్టిసారించారు.అటు ప్రభుత్వం సైతం రెగ్యులర్ పోస్టుల భర్తీ చేపడుతుండగా, మరోపక్క జడ్పీ ఆస్తుల లెక్క తేలిపోయింది.

మూడింటికి మూడు..

11 నెలల్లో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు మూడు జడ్పీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌లకు 2021 లో ఎన్నికలు జరగ్గా సెప్టెంబరులో ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో గత నెలలో ముగిసిన సెప్టెంబరుతో వీటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తయింది. అయితే జిల్లా పరిషత్‌లకు కొత్త పాలకవర్గాలకు ఏర్పడిన ఏడాది తర్వాత రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. అయితే న్యాయపరమైన చిక్కుల కారణంగా విభజిత జిల్లాలకు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీనే కొనసాగించారు. దీంతో ఇప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే జిల్లా పరిషత్ సమావేశాలు జరుగుతున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత జడ్పీకి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తికానుంది. దీంతో తదుపరి జరిగే జిల్లా పరిషత్ ఎన్నికలు మూడు కొత్త జడ్పీలు విభజించి నిర్వహించాల్సి ఉంది. త్వరలో జరగనున్న పంచాయతీలు, మునిసిపాలిటీలతో పాటే జడ్పీలకు ఎన్నికలు జరగొచ్చనే చర్చ జరుగుతోంది. దీనిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఏడాదికంటే ముందుగానే ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న రాజధాని అధికారుల సంకేతాలతో ప్రస్తుతం జిల్లా పరిషత్ అధికారులు మూడు కొత్త జడ్పీల ఏర్పాటు, విభజిత జిల్లాల ప్రకారం ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంపై దృష్టిసారించారు.ఆరు నెలల్లో మూడు కొత్త జడ్పీలను ఏర్పాటు చేసే కసరత్తు పుంజుకోనుంది.

వాటిపై స్పష్టత ఎలాగో..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిషత్‌లో 62 మంది జడ్పీటీసీలు, 997 మంది ఎంపీటీసీలు ఉన్నారు.మూడు జిల్లాలకు సంబంధించి ఆయా మండలాల ప్రకారం ఏ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఏ జిల్లా పరిధిలోకి వస్తారనే దానిపై స్పష్టత ఉండడంతో దాని ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైన ఓటర్ల జాబితాను మండలాలవారీగా విభజించనున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాల విభజన గందరగోళంగా జరగడంతో ఇప్పటికీ వీటిపై ప్రజలనుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విభజిత జిల్లాలపై వస్తోన్న అభ్యంతరాలపై మార్పులు చేర్పులు చేయడానికి ఇప్పటికే మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో భాగంగా కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని వినతులు వెల్లువెత్తాయి. రామచంద్రపురం నియోజకవర్గం మొత్తాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడాన్ని గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజనలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని ఉమ్మడి విశాఖ పరిధిలోని పాడేరు డివిజన్‌లో కలిపి అల్లూరి జిల్లాగా మార్చారు. ఈ నేపథ్యంలో రంపచోడవరంలోని 11 జడ్పీటీసీలు, ఇతర ఎంపీటీసీలను అల్లూరి జిల్లాలో కలపొద్దనే డిమాండ్లు వెల్లువెత్తుతుతున్నాయి. లేదంటే తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సర్దుబాట్లు ఎలా ఉంటాయనేదాని ఆధారంగా కొత్త జడ్పీల ఏర్పాటు తుది రూపు సంతరించుకోనుంది.

ఆ మూడూ ఇటే..

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాకు కొత్తగా ఏర్పడే జిల్లా పరిషత్‌లోకి చేరనున్నాయి. ప్రస్తుతం జడ్పీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలు ఏలూరులో జరిగే జడ్పీ సమావేశాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది. అదే కొత్త జడ్పీలు ఏర్పడిన తర్వాత ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో జడ్పీటీసీలు రాజమహేంద్రవరంలో జరిగే జడ్పీ సమావేశాలకు హాజరవుతారు.ప్రధానంగా కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి విభజిత జిల్లాల ప్రకారం ఏర్పడే రాజమహేంద్రవరం జిల్లా పరిషత్‌లో ఈ మూడు నియోజక వర్గాల నుంచి పది మంది జడ్పీటీసీలు చేరనున్నారు.

కసరత్తు వేగంగానే..

కొత్తగా మూడు జడ్పీల ఏర్పాటుకు సంబంధించి అంతర్గతంగా అధికారులు కసరత్తు ఆరంభించారు. వీటికి కూడా ఆరునెలలోపే అంటే జూలైలోగా ఎన్నికలు ఉండొచ్చని పైస్థాయి నుంచి సంకేతాలు అందడంతో ఓటర్ల జాబితాతో పాటు ఆయా మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీవోలను భర్తీ చేస్తున్నారు. జడ్పీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోల పాత్ర కీలకం కావడంతో ఈ దిశగా ఇప్పటికే నియామకాలు జరుగుతున్నాయి. సిబ్బంది సర్దుబాటుపైనా అధికారులు దృష్టిసారించారు.ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులు ఎంతనేది ఇప్పటికే లెక్క తేల్చారు.మూడు జిల్లాల్లో ఎక్కడిక క్కడ జడ్పీకి భవనాలు,అద్దెల రూపంలో వచ్చే ఆదాయం స్థలాలు గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు.

'కార్తీకం'లో పుణ్యక్షేత్రాల సందర్శనకు

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



- పంచారామాలు, శబరిమలై యాత్రలకు ప్యాకేజీల విభజన
- వనసమారాధనలకు అనువుగా మన్యసీమ దర్శని ఏర్పాటు

అమలాపురంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శైవక్షేత్రాల దర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కార్తీక మాసం ప్రారంభమైనందున పంచారామక్షేత్రాల దర్శనంతోపాటు శబరిమలై వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సు సర్వీసులను అమలాపురం ఆర్టీసీ బస్సు డిపోనుంచి ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. వనసమారాధనల్లో భాగంగా మన్యసీమ దర్శిని పేరిట ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో ఇన్‌చార్జి డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ అధ్యక్షతన బుధవారం పంచారామ క్షేత్రాల దర్శనానికి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. రామచంద్రపురం, రాజోలు డిపో మేనేజర్లు భాస్కరరావు, జేమ్స్, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, నాగరాజు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ వరహాలబాబు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి..

ఒకేరోజు దర్శించుకునేలా ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశారు. కార్తీకమాసంలో ప్రతి ఆదివారం రాత్రి 7గంటలకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో అమలాపురం డిపోనుంచి ప్రత్యేక బస్సులు ఉంటాయి. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలోని శైవక్షేత్రాలను దర్శించుకుని తిరిగి సోమవారం రాత్రికి అమలాపురం చేరుకుంటారు.ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు రూ.950, అల్ట్రాడీలక్స్ రూ.1170, సూపర్‌లగ్జరీకి రూ.1223గా టిక్కెట్ ధర నిర్ణయించారు. ఉద్యోగులు,వ్యాపారుల కోరిక మేరకు కార్తీకమాసంలో ప్రతి శనివారంరాత్రి 7గంటలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

మన్యసీమ దర్శినికి ప్రత్యేకం..

కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాల దర్శనంతోపాటు వనసమారాధనల్లో భాగంగా మన్యసీమ దర్శిని పేరిట ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం ఈప్రత్యేక బస్సులు అమలాపురం డిపోనుంచి బయలుదేరుతాయి. ఈనెల 26, నవంబరు 2, 9, 16వ తేదీల్లో మన్యసీమ దర్శిని బస్సులు బయలుదేరి రాత్రి 8 గంటలకు అమలాపురం చేరుకుంటుంది.యాత్రలో భాగంగా ర్యాలీ మోహినీ అవతార కేశవస్వామి, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి, సీతపల్లి బాపన్నమ్మ, రంప పురాతన శివాలయం, రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్‌లను దర్శించుకుంటారు.మధ్యాహ్నం మారేడుమిల్లిలోని కాఫీ తోటలు, జలతరింగిణి జలపాతం, పాములేరు వాగు తదితరచోట్ల వనసమారాధనలు జరుపుకుంటారు.ఎక్స్‌ప్రెస్ సర్వీసు టిక్కెట్ ధర రూ.450గా నిర్ణయించారు.

శబరిమలై యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ

శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అమలాపురం నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఆరురోజుల యాత్రలో భాగంగా కాణిపాకం, సిరిపురం, అరుణచాలం, పళని, శబరిమల, మధురై, కంచి, తిరుపతి, విజయవాడ క్షేత్రాలను దర్శించుకోవచ్చు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.5వేలు, ఏసీ బస్సుకు రూ.6400గా టిక్కెట్ ధరలు నిర్ణయించారు. ఈ క్షేత్రాలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు రిజర్వేషన్ సదుపాయం కోసం అసిస్టెంట్ మేనేజర్ సెల్: 7013868687, రిజర్వేషన్ కౌంటర్ సెల్: 9959225576ను సంప్రదించాలి.

గొల్లపుంతకాలనీలో అనర్హులుంటే..

పట్టాలు రద్దు చేస్తాం

- ఇళ్లను మధ్యలో వదిలేసిన వారంతా నిర్ణీత గడువులోపు నిర్మాణం పూర్తి చేసుకోవాలి
- సర్వేలో బయటపడ్డ క్రయవిక్రయాలు
- సమీక్షలో ఎమ్మెల్యే వేగుళ్ల
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మండపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో 16ఏళ్లక్రితం ప్రభుత్వం గొల్లపుంతకాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇటీవల రెవెన్యూశాఖకు చెందిన 14 బృందాలు క్షుణ్ణంగా ఇంటింటా సర్వే నిర్వహించాయి. సర్వేలో పలు అంశాలు బట్టబయలయ్యాయి. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీంతో ఇక్కడ జరిగిన అవకతవకలు, అక్రమాలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశాల మేరకు మండపేట రెవెన్యూశాఖ అధికారులు ఇటీవల సర్వే నిర్వహించారు. అనంతరం బుధవారం మండపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూశాఖ అధికారులతో ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సర్వేలో వెల్లడైన అంశాలను ఆయనకు తహసీల్దార్ పి.తేజేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైనవారికి అన్యాయం జరగదని, లబ్ధిదారులకు భరోసాఇచ్చారు. పట్టాలు తీసుకుని ఇప్పటివరకు ఇళ్లను నిర్మించుకోకుండా ఖాళీస్థలాలు వదిలేసిన వారి పట్టాలను రద్దు చేసి అర్హులైన వారికి ఇస్తామని ఆయన హెచ్చరించారు.ఇళ్లస్థలాలు పొంది సగంలో ఇంటి నిర్మాణాలు చేసి వదిలేసిన వారు, బేస్‌మెంట్ లెవెల్ వరకు నిర్మించి వదిలేసిన వారు తక్షణమే ఇంటి నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని సూచించారు. లేకుంటే వారందరినీ అనర్హులుగా గుర్తించి ఇళ్లపట్టాలు, ఇళ్లను రదు చేసి అర్హులకు అందజేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. కాలనీలో 16ఏళ్లక్రితం 1996మందికి ఇళ్లస్థలాలు అందించగా అందులో 191మంది ఇప్పటివరకు ఇళ్లను నిర్మించుకోలేదని సర్వేలో వెల్లడైంది. దీంతో వారందరి ఇళ్లపట్టాలు రద్దుకు వెనకాడబోమని అధికారులు స్పష్టంచేశారు. మరో 462మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టి బేస్‌మెంట్‌పునాదులు స్థాయిలో వదిలేశారని అధికారులు గుర్తించారు. వారంతా ఇళ్లను పూర్తి చేయకుంటే రద్దు చేస్తామని వారు హెచ్చరించారు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం బయటపడింది. పట్టాలు పొందిన లబ్ధిదారుడికి బదులుగా 583మంది ఇంటిస్థలాలు కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నారని సర్వేలో తేలింది. ఆ ఇళ్లను కొనుగోలు చేసిన వారు ఉంటున్నారా? లేక అద్దెకు ఉంటున్నారా? అనే దానిపైనా సర్వేలో అధికారులు విచారణ చేసి వివరాలు రాబట్టారు.అక్రమాలను సర్వేద్వారా సేకరించినపుడు బయటపడ్డ అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి నివేదించి అనర్హుల జాబితాను తొలగించి అర్హులకు ఇచ్చేందుకు చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే గొల్లపుంతకాలనీలో ఇళ్లస్థలాలు కొనుగోలు చేసిన వారికి అద్దె ఇళ్లల్లో ఉండేవారితోపాటు స్థలాలు, ఇళ్లను క్రయ విక్రయాలు చేసిన వారికి రెవెన్యూశాఖ నోటీసులను జారీ చేసిందని తహసీల్దార్ తెలిపారు. ఇవి అందుకున్న వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని లిఖితపూర్వకంగా వివరణ ఇస్తున్నారు. సమీక్షలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తేజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ మెహర్‌బాబా పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో నూతన వరి వంగడాలు వేయాలి



వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో సమీక్షిస్తున్న కలెక్టర్

- వ్యవసాయశాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్
- పలువురు శాస్త్రవేత్తల సలహాలు

అమలాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే రబీ సీజన్‌లో రొటీన్‌కు భిన్నంగా నూతన వరి వంగడాలను నాటడానికి రైతులు సన్నద్ధం కావాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు.ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో రబీ సీజన్ సన్నద్ధతపై వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిసారి ఉపయోగించే బొండాలు 3626రకాలకు బదులు 1232, 1239 సన్నరకాలను వినియోగించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ సాగు క్షేత్రాల్లో గడ్డిని డీకంపోజ్ చేసి సహజ ఎరువుగా మార్చుకోవాలని, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ఎండుగడ్డిని సేకరించే పరికరాల కొనుగోలుకు సీఎస్సార్ ద్వారా నిధులు సమకూర్చామన్నారు. వరదల సమయంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాసం, స్ట్రాబీలర్ రూపంలో సేకరించి భద్రపరిచి పశువుల అవసరాలు తీర్చాలని సూచించారు. ఎకరాలకు 50 స్ట్రాబేర్ గడ్డి బండిల్స్ వస్తాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే సన్నరకాలపై రైతులు దృష్టిపెట్టాలని సూచించారు. రబీలో నీటి ఎద్దడి తట్టుకునే వంగడాలను నాటేదిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సేంద్రీయ పద్ధతులు,నానోయూరియా పద్ధతులు ఉపయోగించి రసాయనిక యూరియా వాడకాన్ని తగ్గించాలని, ఇందుకోసం మండలాల్లో కొంతమంది రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవసాయ నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్త గిరిజారాణి మాట్లాడుతూ తక్కువ కాలవ్యవధిగల వంగడాలు, తెగుళ్లను తట్టుకునే లక్షణాలున్నవాటిని ఎంపిక చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రీయఎరువులు వేసే సందర్భంలో నేలలో భౌతికమైన నికార్సయిన పరిస్థితి, నీటి సరఫరా, పంట అవశేషాల నిర్వహణ తప్పనిసరి అన్నారు. సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఏరువాక శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫిర్యాదులను నూరుశాతం నాణ్యతతో పరిష్కరించాలి'

అమలాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారిస్తూ నూరుశాతం నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం అధికారులను ఆదేశించారు. అమరావతినుంచి రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పీజీఆర్ఎస్, గృహ నిర్మాణాల్లో ఖాళీ ప్లాట్లు, అభ్యంతరాలులేని భూముల క్రమబద్ధీకరణ, జీవో నెంబరు 30, కులధ్రువీకరణ, జిల్లాలు, మండలాల పునర్విభజన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యా అంశాలను దృష్టిలో పెట్టుకుని ఫిర్యాదును పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోకుండా సకాలంలో కుల ధ్రువీకరణ చేపట్టి రిజర్వేషన్లు పొందే దిశగా సహకరించాలన్నారు. జేసీ నిషాంతి, ఆర్డీవోలు శ్రీకర్, డి.అఖిల, కె.మాధవి పాల్గొన్నారు.

కాటేసిన కామాంధులు!

సమాజంలో కొందరు వావి వరుసలు మర్చిపోయి కామాంధులైపోతున్నారు.. రాజమహేంద్రవరం, తునిలో జరిగిన రెండు ఘటనలే అందుకు ఉదాహరణ. ఒకడు అన్నను అంటూ హాస్టల్ వార్డెన్‌కి మాయమాటలు చెప్పి బాలికను తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.. మరొకడు తాతయ్యను అంటూ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు.. ఈ రెండు ఘటనలు సమాజంలో బాలికల భద్రతను ప్రశ్నిస్తున్నాయి..

7

కార్తీకమాసంలో తీరప్రాంతాలవద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలి: ఎస్పీ

అమలాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, నదీ తీరప్రాంతాలు కార్తీక వనభోజన ప్రదేశాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పోలీసు అధికారులను ఆదేశించారు. అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి రోజున శివాలయాలు, స్నానఘట్టాల వద్ద భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, పార్కింగ్ స్థలాలను ముందే గుర్తించి వాటిని భక్తులకు చూపించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి షీటీమ్‌లతో నిఘా పెంచాలన్నారు. వనభోజన ప్రాంతాల్లో దీపారాధనలు చేసే చోట అగ్నిమాపక జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్తీకమాసంలో పోలీసులు భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూజాకార్యక్రమాలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

యానాంలో భారీ వర్షం



నీట మునిగిన పిళ్లయ్యార్‌స్వామి ఆలయం

7



రాజమహేంద్రవరం గోదావరి నదిలో పాడ్యమి దీపాలు వదులుతున్న మహిళలు



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు




పిఠాపురం పాదగయ క్షేత్రంలో పాడ్యమి దీపాలతో భక్తులు

పరమశివునికి ప్రణమిల్లి

- కార్తీక మాసం తొలిరోజు శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- పరమశివునికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు
- పాడ్యమి దీపాలు వెలిగించిన మహిళలు





సామర్లకోటలో జ్యోతిర్లింగార్చన



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో గోలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ



కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం లోని పాదగయ క్షేత్రం కార్తీక మాసం తొలిరోజైన బుధవారం భక్తజనసంద్రమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే పాదగయకు చేరుకున్న భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాసానికి ప్రారంభ సూచకంగా అరటి డొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదిలారు. మహిళలు, చిన్నారులు, భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్వయంభూగా వెలసిన రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అభిషేకాలు జరిగాయి. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. శివమాలధారులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయమంతా దీపాలు వెలిగించడంతో వెలుగులు విరజిమ్మాయి. ఉచిత అన్నప్రసాదాలు, చిన్నారులకు పాలు, బిస్కట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాదగయ ఆవరణలో శివలింగానికి అభిషేకం చేస్తున్న శివమాలధారులు

శివనామస్మరణతో మార్మోగిన సామర్లకోట



భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు, విశేషాలంకరణలో స్వామి

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజ జరిపారు. భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలను ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. విశేష పుష్పార్చన జరిపి స్వామివారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 800 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసరు కె.నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తొలిరోజు లక్ష పత్రి పూజలో జగ్గంపేటకు చెందిన కంచర్ల కుటుంబీకులు ఆశీనులయ్యారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు రాత్రివేళ పూరీలు, పుల్కాలు, చపాతీలను ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్టు ఆవరణలో అందజేస్తామని ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ విలేకరులకు తెలిపారు.



భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

లేటరైట్ తవ్వకాలు, తరలింపుతో జీవితాలు చిన్నాభిన్నం

- లేటరైట్ మైనింగ్ నిలిపివేయాలని డిమాండ్
- డిప్యూటీ సీఎం నివాసంలో ఫిర్యాదు చేసిన అనకాపల్లి జిల్లా గిరిజనులు



జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున సాగుతున్న లేటరైట్ తవ్వకాలు, రవాణాతో తమ జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని, భూములు సాగు చేసుకునే అవకాశం కోల్పోయామని అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వచ్చి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎంకు తమ సమస్యలు తెలియజేయాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తామంతా ప్రకృతిపై ఆధారపడి పోడు వ్యవసాయంతో జీవనం సాగించేవాళ్లమని తెలిపారు. 2014, 2021 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వ పెద్దలు ఇక్కడ లాటరైట్ తవ్వకాలను ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారని చెప్పారు. నిత్యం వందల సంఖ్యలో లారీల్లో లేటరైట్ తరలిపోతోందని తెలిపారు. దీనివల్ల తమ భూములు, తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆ ప్రాంతంలో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. నాటి ప్రభుత్వ పెద్దలు కోట్లాది రూపాయలను లేటరైట్ మైనింగ్ ద్వారా ఆర్జిస్తూ తమ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేటరైట్ రవాణా చేసే లారీల కింద పడి పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇదే విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని లేటరైట్ మైనింగ్ నిలుపుదల చేయాలని కోరారు. తమ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుందరకోడ పంచాయతీ బబిడికలొద్ది గ్రామ గంగాలమ్మ వెల్ఫేర్ సొసైటీ, తొరడా గ్రామ నందూలమ్మ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎం.నూకరాజు, టి.శాంతి, చెల్లాయ్యమ్మ, సంకు రమణ, నూకలోవ పాల్గొన్నారు.

తక్కువ వ్యవధిలో విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శ్రీకారం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్'ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలా తక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఇందులో ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800
- ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.

ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..

నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు

మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్



స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడంవల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణా అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకొని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.87 కోట్లు

- బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, 25 విదేశీ కరెన్సీ నోట్లు



వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారులు డి.సురేష్‌బాబు, జె.రామలింగేశ్వరావు, పీవీవీఎస్ కామేశ్వరావు పరివేక్షణలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 35 రోజులకుగాను ప్రధాన హుండీలు ద్వారా రూ.1,41,69,487, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.45,63,842 వెరసి రూ.1,87,33,329 ఆదాయం లభించింది. బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, ఆరు దేశాలకు చెందిన 25 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, వేద పండితులు, బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

- నన్నయలో అంతర్‌జిల్లాల జూడో పురుషులు, మహిళల పోటీలు



జూడో పోటీలను తిలకిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

దివాన్‌చెరువు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జూడో క్రమశిక్షణ, గౌరవం, అజేయమైన స్ఫూర్తిని సూచిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో జూడో పురుషుల, మహిళల అంతర్ కళాశాలల ఛాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు బుధవారం జరిగాయి. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీలను వీసీ ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్ కళాశాలల జూడో ఛాంపియన్‌షిప్ నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం క్రీడలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ క్రీడాపోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం వివిధ కేటగిరీలలో జూడో పురుషులకు, మహిళలకు పోటీలు నిర్వహించారు. మహిళలకు48 కేజీల నుంచి 78 కేజీల వరకూ, పురుషులకు 60 కేజీల నుంచి 100 కేజీల వరకూ పోటీలు జరిగాయి. దీనిలో ఉత్తమ ప్రతిభకనబరచిన విజేతలను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసి వచ్చేనెల 10 నుంచి 14 వరకూ భోపాల్‌లోని గ్లోబల్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ వెస్ట్‌జోన్ పోటీలకు పంపుతారు. పోటీల అనంతరం విజేతలకు పతకాలను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, క్రీడాబోర్డు సహాయకార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి, పరిశీలకుడు ఎస్.వి.ఎల్.ఎల్.జి.వర్మ, సభ్యులు పి.వి.తేజ, టి.వి.వి.రమణ, జిల్లా డి.ఎస్.డి.ఓ. డీఎంఎం శేషగిరి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కార్తీక ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- 2న క్షీరాబ్ది ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవం ఘనంగా నిర్వహించాలి
- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే రూ.3లక్షల విరాళం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు

కోరుకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని కోరుకొండ దేవాలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవ స్థాన కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులు, వివిధశాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కోరుకొండ శ్రీలక్ష్మీనసిహస్వామి కార్తీకమాస శుద్ధ ద్వాదశి ఉత్సవాలను వైభవంగ నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లక్ష్మీనరసింహస్వామివారి గిరి ప్రదక్షణ, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్తీకమాసంలో నవంబర 2న తేదీ క్షీరాబ్ధి ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్తీకశుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి)రోజున సాయంత్ర 5గంటల నుంచి స్వామివారి విగ్రహాలను పల్లకీపై ఊరేగింపుగా గిరి ప్రదక్షణ నిర్వహిస్తూ కోనేరు వద్ద నిర్వహించే తెప్పోత్సవం విజయవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైదిక కార్యక్రమం నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. తెప్పోత్సవంనకు తగిన ఏర్పాట్లు, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇన్సూరెన్స్ వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. కోనేరు వద్ద విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని పేర్కొన్నారు. వేదిక వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా కోరుకొండ మెడికల్ అధికారులను ఆదేశించారు. తెప్పోత్సవం సందర్భంగా లైఫ్ జాకెట్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. గజ ఈతగాళ్ళను అందుబాటు ఉంచాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్, అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ సూచించారు. తెప్పోత్సవం విజయవంతం కావడానికి వీలుగా కోనేరులో నీరు నిలిచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య లోపం లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కార్తీకమాస ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా జరిగే అన్నదాన కార్యక్రమానికి బత్తుల కుటుంబం నుంచి రూ.3లక్షలు విరాళంను ఎమ్మెల్యే ప్రకటించారు.

కన్నేసి.. కాటేసి!

- తునిలో బాలికపై ఘోరం
- తాతయ్య వరసయ్యే వృద్ధుడు కాటేసిన వైనం
- ఆస్పత్రి పేరుతో బాలికను పాఠశాల నుంచి తీసుకువెళ్లిన నిందితుడు
- తొండంగిలో ఓ తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం: ఆనక స్కూల్లో దించేసి ఇంటికి..
- వీడియో వైరల్ అవడంతో విషయం తెలిసి నిందితుడిని చితకబాదిన బంధువులు
- బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యాచారంగా నిర్ధారణ
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు: పోక్సో, అత్యాచారం, కిడ్నాప్ కేసుల నమోదు

దారుణం.. అమానుషం.. మాటల్లో చెప్పలేని ఘోరం.. మాయమాటలు చెప్పి అభం శుభం ఎరుగని బాలికపై అత్యాచారం.. తాతయ్య వరుసయ్యే దగ్గరి బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా చేసింది..


నారాయణరావును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

(కాకినాడ/తునిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారులో ఓ గురుకుల పాఠశాలలో ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. కొంత కాలం కిందట బాలిక తండ్రి మరణించాడు. ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో ఆమెను చదువు మానిపించేయాలని అనుకున్నా, ఆ పని చేయలేక తల్లి గురుకుల పాఠశాలలో చేర్పించింది. వీరికి దగ్గరి బంధువైన తుని పట్టణంలో రెండో వార్డుకు చెందిన తాటిక నారాయణరావు(62) బాలికపై కన్నేశాడు. మాయమాటలు చెప్పి గురుకుల పాఠశాల యాజమాన్యాన్ని తాను బాలిక తాతయ్యగా నమ్మించాడు. అనేకసార్లు పాఠశాలకు వచ్చి బాలికను ఆస్పత్రికి చూపించాలంటూ స్కూల్ నుంచి తీసుకువెళ్లేవాడు. తాతయ్య కావడంతో పాఠశాల సిబ్బందికి కూ డా అనుమానం రాలేదు. ఎప్పటిలా అతడు మంగళవారం ఉదయం 11 గంటలకు స్కూలుకు వచ్చి బాలికను బయటకు తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెకు తిను బండారాలు కొనిచ్చాడు. తనంటే ఇష్టం ఏర్పడేలా చేసుకున్నాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఓ రైతు గమనించి అక్కడికి వచ్చాడు. నువ్వెవరు.. స్కూలు పిల్లను తోటలోకి తీసుకువచ్చి ఏం చేస్తున్నావంటూ నిలదీశాడు. అత్యాచారం చేసిన సదరు నిందితుడు రైతుపై ఎదురుతిరిగాడు. దీంతో రైతు మరింత ఆగ్రహంతో స్కూలు అమ్మాయిని తోటలోకి తీసుకువచ్చి బట్టలు విప్పి ఏం చేస్తున్నావు.. అంటూ గద్దించాడు. దీంతో నిందితుడు మరింత ఎదురుతిరిగి నేను మున్సిపాల్టీ కౌన్సిలర్‌ను అంటూ గట్టిగా మాట్లాడాడు. బాలికను ఇదే తోటలోకి అనేకసార్లు తీసుకువచ్చి ఇక్కడ ఏం చేస్తున్నావు అంటూ రైతు మళ్లీ నిలదీయడంతో.. నేను పాడు చేశానా.. అమ్మాయి బాత్‌రూంకి అంటే తీసుకువచ్చా అంటూ బుకాయించాడు. బట్టలు విప్పి ఏంచేస్తున్నావు అని గద్దించి పోలీసులకు ఫోన్ చేస్తా అని రైతు మరింత నిలదీయడంతో తాతయ్యను అవుతాను.. బాత్‌రూంకు తీసుకువచ్చాను అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత గుట్టుగా బాలికను గురుకుల పాఠశాలలో దించేసి ఏం ఎరుగనట్లు తునిలో తన ఇంటికి వెళ్లిపోయాడు.

వైరల్ అవడంతో..

తోటలో బాలికతో సదరు నిందిడుతు ఉన్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అవికాస్తా క్షణాల్లో వైరల్ అయ్యాయి. దీంతో విషయం బాలిక కుటుంబీకులు, బంధువులకు తెలిసింది. దీంతో వారంతా సదరు నిందితుడి ఇంటికి వెళ్లి నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో వారంతా సదరు నిందితుడికి మంగళవారం రాత్రి దేహశుద్ధి చేసి తుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత బుధవారం ఉదయం గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. బాలికను పదేపదే నిందితుడితో ఎలా పంపిస్తారనే దానిపై గురుకుల పాఠశాల సిబ్బందిని నిలదీశారు. కాసేపటికి పోలీసులు రావడంతో వారిని కూడా నిలదీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సాయంత్రం బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యాచారం జరిగినట్లు నిర్ధారించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు తుని రూరల్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తుని రూరల్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 250/2025 కింద యూ/ఎస్ 137 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ప్రిన్సిపాల్ వివరణ..

ఈ ఘటనపై గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగజ్యోతి మాట్లాడుతూ తాను పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరడం వల్ల ఎప్పటి నుంచో కొనసాగుతున్న ఉపాధ్యాయుల ధ్రువీకరణ మేరకు బాలిక బయటకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ

దుష్ప్రచారంపై హెచ్చరిక..

కాగా నిందితుడు కూటమి పార్టీకి చెందిన వ్యక్తిగా చిత్రీకరించేందుకు వైసీపీ ప్రయత్నం చేయడం వివాదాస్పదంగా మారింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురుకుల పాఠశాల వద్ద మీడియాతో మాట్లాడారు. నిందితుడు నారాయణరావుకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. నారాయణరావుపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. కిడ్నాప్, అత్యాచారం కింద వచ్చే వివిధ కఠినమైన సెక్షన్‌లు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు. అయితే బాలిక వీడియోను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని, ఇది కూడా పోక్సో కేసులోకి వస్తుందని డీఎస్పీ తెలిపారు. అత్యాచార ఘటనపై ఎంపీ సానా సతీష్‌బాబు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఖండించి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

రాజమహేంద్రవరంలో బాలికల హాస్టల్ వార్డెన్ సస్పెండ్

కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంక్షేమ బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థినిపై అత్యాచారం సంఘటన నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్య వైఖరి నిర్ధారణ కావడంతో హాస్టల్ అధికారిణి ఉమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. బంధువుల వివరాలు, గుర్తింపు నిర్ధారించకుండానే పిల్లలను బయటకు పంపరాదని స్పష్టం చేశారు. వార్డెన్లు, సిబ్బంది సంపూర్ణ బాధ్యతతో అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. వసతిగృహాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వసతి గృహం విద్యార్థినిపై అఘాయిత్యం దారుణం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యం చాలా దారుణమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బాలికపై అఘాయిత్యం చేసిన అజయ్‌ను అతడికి సహకరించిన మరొక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని చెప్పారు. వసతిగృహాల వద్దకు తల్లిదండ్రులను తప్ప ఎవ్వరినీ అనుమతించకూడదని, ఎవరైనా వస్తే సరైన ఆధారాలు ఉంటేనే అనుమతి విషయంలో ఆలోచించాలని కోరారు.

బాణసంచా పేలుడు ఘటనలో బాధితులకు.. రూ.కోటి 50 లక్షల చెక్కు అందజేత


చెక్కును కార్మికశాఖ సహాయ కమిషనర్‌కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలో శ్రీలక్ష్మీ గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా రూ.కోటి 50లక్షల చెక్కును కోనసీమ సహాయ కార్మిక కమిషనర్‌కు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సంఘటనలో పది మంది మృత్యువాత పడ్డారు. పేలుడు వల్ల మరణించిన వారికుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఏపీ కార్మికశాఖ సంక్షేమ మండలి కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కార్మికశాఖ కమిషనర్ రూ.కోటి 50లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ పేరున అందజేశారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం కింద నమోదైన సంస్థల్లో పనిచేసే కార్మికులకు కార్మిక సంక్షేమ మండలినందు రూ.100 వంతున వెల్ఫేర్ ఫండ్ చెల్లించడం జరుగుతుంది. యజమాని వాటా రూ.70, కార్మికుని వాటా రూ.30 చొప్పున చెల్లిస్తారు. దీని ద్వారా సంక్షేమ పథకాలు అందించేవారు. అయితే ఈ పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినప్పటికీ కోనసీమ కలెక్టర్ చొరవతో రాయవరం ఘటన బాధితులకు రూ.కోటి 50లక్షలు మంజూరు చేయడం జరిగిందని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ పేర్కొన్నారు.

వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు యువకుడు బలి

ప్రత్తిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగ ఉచ్చుకు యువకుడు బలయ్యాడు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామ పంచాయతీ శివారు ఆరేళ్ళ ధార వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామం నూకాలమ్మ గుడి వీధికి చెందిన వందల వీర కుమార్ (31)వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం వేకువ జామునే పని నిమిత్తం వంతాడ యార్డ్ సమీపంలో గల ఆరేళ్ళధార పొలాల్లో నడిచి వెళ్తుండగా వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చుకు చెందిన కరెంటు తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పొలాల్లోకి పనిబాట్లకు వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరకుమార్‌కు భార్య కాసులమ్మ, కొడుకు దుర్గాతేజరాజ్‌కుమార్ ఉన్నారు.


వీర కుమార్ (ఫైల్)

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

గాజువాక వాసి మృతి

కడియం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక పరిధిలోని బుర్రిలంక గోకుల్‌నర్సరీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజువాక అగనంపూడికి చెందిన వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కడియం పోలీసుల కథనం ప్రకారం.. గాజువాక అగనంపూడికి చెందిన దాసరి కిరణ్‌కుమార్(26) కారులో విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్తున్నాడు. కడియపులంక వద్ద ఆగి ఉన్న లారీని అదుపుతప్పి కారు ఢీకొనడంతో కిరణ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. హైవే సేఫ్టీ అధికారులు క్రేన్ సహాయంతో లారీ నుంచి కారును వేరు చేయించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడియం పోలీసులు కేసు నమోదు చేశారు.


కిరణ్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

మానసిక స్థితి సరిగా లేక బ్లేడుతో గొంతు కోసుకున్న వ్యక్తి


గొంతు కోసుకున్న దాసు

వై.రామవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి బుధవారం వై.రామవరం, యార్లగడ్డ గ్రామాల మధ్య శివాలయం సమీపంలో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా కొయ్యూరు మండల యు.చీడిపాలెం పంచాయితీ కంపు మామిడికి చెందిన కాళ్ళ దాసు (45)కు మానసిక స్థితి సరిగా లేక గతంలో కుటుంబీకులు రాజమండ్రిలో చికిత్సకు తీసుకెళ్లారు. ఇంటికొచ్చాక పురుగు ల మందు తాగడంత మళ్లీ కాకినాడ తరలించారు. అక్కడ నుంచి పి.ఎర్ర గొండ సచివాలయంలో నర్సుగా పని చేస్తున్న తన అక్క కూతురు ఇంటికి వచ్చిన కాళ్ళ దాసు బ్లేడుతో గొంతు కోసుకున్నట్టు భార్య, కుమార్తె తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్, మరో ఇద్దరిపై కేసు కొట్టివేత

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏఎంసీ మాజీ చైర్మన్ నృసింహదేవర విశ్వనాథం, మరో ఇద్దరిపై గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి సోదరుడు వీరభద్రారెడ్డి పెట్టిన కేసును కోర్టు బుధవారం కొట్టివేసింది. వివరాలను విశ్వనాథం తెలిపారు. 2019 ఎన్నికల పోలింగ్‌లో అవకతవకలకు పాల్పడినట్టు విశ్వనాథం, మరో ఇద్దరిపై వీరభద్రారెడ్డి కేసు పెట్టారు. దీంతో 2019 మే 26న వీరిపై కేసు నమోదు చేశారు. ఐదేళ్ల పాటు కాకినాడ సెకండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగింది. అభియోగాలు రుజువు కాకపోవడంతో ఈ కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు

చర్యలు తీసుకోవాలని కాకినాడ కలెక్టర్‌కు రైల్వే అధికారుల ఫిర్యాదు

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో ఎఫ్‌సీఐ గోదాముల నుంచి రైల్వే స్టేషన్ వరకూ సుమారు 2కిలోమీటర్ల ట్రాక్ పొడవునా రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైల్వే విజయవాడ డివిజినల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైల్వే అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ ఎన్.శ్రీనివాసరావు సామర్లకోట మండల సర్వేయర్లు బుధవారం సామర్లకోట రైల్వే ఏఈఎన్ ప్రభాకర్‌తో సమీక్షించారు. సర్వేయర్ల వద్ద ఉన్న పాత అడంగళ్ మ్యాపులను అధికారులు పరిశీలించారు. వాస్తవంగా ఉన్న కనిపిస్తున్న విస్తీర్ణానికి పత అడంగళ్‌లో ఉన్న విస్తీర్ణానికి ఎక్కడా పొంతనలేకుండా ఆక్రమనలు పెరిగి పోయినట్టు రైల్వే అధికారులు గుర్తించారు. అలాగే మట్టపల్లి వారి చెరువు నుంచి పొర్లు జలాలు బయటకు వెళ్లేందుకు 15ఏళ్ల క్రితం నిర్మించిన స్లూయి జ్‌లను ఆక్రమించి చెరువు నుంచి జలాలు రైల్వే భూములమీదుగా వెళ్లేందుకు వీలులేకుండా పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడినట్టు ప్రాథమికంగా రైల్వే అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణల వల్లే సామర్లకోట ఎగువ ప్రాంతాల్లో వర్షం నీరు సత్యనారాయణపురం మీదుగా రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలుగుతుందని నివేదికను విజయవాడ రైల్వే ఉన్నతాధికారులకు పంపినట్టు సమాచారం.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా విషాదం

- వ్యాన్ ఢీకొని కుమారుడి మృతి
- తల్లిదండ్రులకు గాయాలు
- గుత్తులవారిపాలెం సమీపంలో ఘటన


మృతిచెందిన రామవెంకట కృష్ణప్రసాద్ (ఫైల్)


గాయపడిన నూకరత్నంను ఆటోలో తరలిస్తున్న దృశ్యం


గాయపడిన నూకరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న వారిని కోళ్ల వ్యాను ఢీకొనడంతో మోటారు సైకిల్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా అతడి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులో గుత్తులవారిపాలెం సమీపంలో బుధవారం జరిగింది. యానాం సుభద్ర నగర్‌కు చెందిన దింపు కార్మికులు మట్టపర్తి నూకరాజు (50), అతడి భార్య నూకరత్నం (47), కుమారుడు రామ వెంకటకృష్ణప్రసాద్ (22) పల్సర్ మోటారు సైకిల్‌పై అప్పనపల్లి బాలబాలాజీని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ముమ్మిడివరం బైపాస్ రోడ్డు గుత్తులవారిపాలెం సమీపంలో ఎదురుగా ఖాళీగా వస్తున్న కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామవెంకటకృష్ణప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి నూకరాజు, తల్లి నూకరత్నం తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఐటీడీఏ ఏపీడీ టి.విశ్వనాథం స్పందించి అంబులెన్సుకు ఫోన్ చేయగా అది రావడం ఆలస్యం అవుతుందని భావించి గాయపడిన నూకరత్నం, నూకరాజును ఆటోలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ టి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ విశ్వనాథం మాట్లాడుతూ ప్రమాదాలు ఎలా జరుగుతాయో ముందుగా ఎవరూ ఊహించలేమని, మనవంతు జాగ్రత్తలు పాటించాలన్నారు. వెంకటకృష్ణప్రసాద్ హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృత్యువాతకు గురయ్యాడన్నారు.

వ్యక్తి హత్య కేసులో ఐదుగురి అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, చిత్రంలో సర్కిల్‌లోని ఎస్ఐలు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన తమిళనాడుకు చెందిన వ్యక్తి హత్య కేసులో ఐదుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ వెల్లడించారు. పిఠాపురం పట్టణ శివారులోని ఆర్వోబీ సమీపంలో గల వాసంశెట్టి పెద్దిరాజు పొలంలో తల, శరీరంపై గల గాయాలతో మరణించి ఉన్నట్టు వీఆర్వో కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 8న పిఠాపురం పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో పట్టణ, రూరల్, కొత్తపల్లి ఎస్ఐలు మణికుమార్, జానీ బాషా, వెంకటేష్ ఆధ్వర్యంలో 3 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజీలు, సాక్షుల కథనాల ఆధారంగా విచారణ సాగించి మృతుడిని తమిళనాడు రాష్ట్రంలోని తేని జిల్లా మైలాడంబారై ప్రాంతంలోని కొమనపంతుల పంచాయతీ మనుతు గ్రామానికి చెందిన పాండేగా గుర్తించారు. ఇతడు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలోని తినుబండారాల తయారీ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. ఇతడికి అక్కడ తమిళనాడు రాష్ట్రం తూతికూడి జిల్లా పెరియసామిపురం ప్రాంతానికి చెందిన పౌల్‌రాజ్ ఆండోనీ, లార్డు పకియం, మేల్మండా గ్రామానికి చెందిన మడసామి కారుప్పస్వామితో పరిచయం ఏర్పడింది. వీరు అక్కడే పనిచేసే పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన పూచి ధనలక్ష్మి (ధనమ్మ) భర్త రామస్వామికి ఆరోగ్యం బాగోలేక పోవడంతో పరామర్శకు వచ్చారు. అక్కడ పాండే ధనమ్మతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు చెప్తున్నారు. దీంతో 7వ తేదీ రాత్రి ఆండోని, ధనమ్మ, పకియం, సామి, పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాగంటి గణేష్‌తో కలిసి పాండేను హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరిని కొత్తపల్లి గ్రామ శివారులో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కాగా హత్యకు గల కారణాలపై పోలీసులు చెప్తున్న వివరాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి విషయంలో వారి మధ్య జరిగిన ఘర్షణే హత్యకు దారి తీసినట్టు సమాచారం. ఇదే విషయం పట్టణంలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

దర్జా దొంగ దొరికాడు!

- పోలీసుల అదుపులో కార్ల దొంగ
- నిందితుడు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం వాసి
- ఏప్రిల్‌లో ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వద్ద చోరీ
- 241 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉడాయింపు
- తునిలో పట్టుకున్న పోలీసులు.. విజయవాడకు తరలింపు

ఇంటి దగ్గర నుంచి దర్జాగా కారులో బయల్దేరుతాడు. ఆలయాల వద్ద నిలిపిన కార్ల వద్ద అటూ ఇటూ తిరుగుతాడు. ఆయుధం పట్టకుండా చేత్తో కారు తలుపులు తెరుస్తాడు. ఆభరణాలు, నగదును చిటికెలో మాయం చేస్తాడు. భక్తుల కార్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): అమలాపురానికి చెందిన ఆచంట దుర్గ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. అమలాపురంలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఏప్రిల్ 15న బయల్దేరిన ఈ కుటుంబం దారిలో దుర్గమ్మ దర్శనం చేసుకోవాలనుకుంది. ఇంద్రకీలాద్రిపై ఓం మలుపు వద్ద కారును నిలుపుదల చేసి, డోర్ లాక్ చేసుకుని దర్శనానికి వెళ్లారు. ఈ కారులో నుంచి 241 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. తిరిగి వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇలా చిక్కాడు..

కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం తలుపులమ్మ లోవలో భక్తుల కార్లను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్న వ్యక్తిని తుని రూరల్ పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్టు చేశారు. ఆ సమయంలో కొంత బంగారాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేస్తుండగానే ఇంద్రకీలాద్రిపై కారులో చేసిన చోరీ బయటకు వచ్చింది. నిందితుడి స్వస్థలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం. అక్కడి నుంచి కారులో బయల్దేరి చోరీలు చేసుకున్నాక తిరిగి వెళ్లిపోతాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండగా, కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. దొంగిలించిన వస్తువులను అదే గ్రామానికి చెందిన ఓ బంగారం వ్యాపారికి విక్రయించాడు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యాపారి వద్ద నుంచి పలు చోరీలకు సంబంధించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కారుతో పాటు విజయవాడ తరలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం తెలియడంతో బంగారం వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. నిందితుడి వయస్సు 45 ఏళ్లు ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద పలు చోరీలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిపై ఎన్ని చోరీలు చేశాడు, ఉమ్మడి జిల్లాల్లో ఏయే ఆలయాల వద్ద ఈ తరహా దొంగతనాలు జరిగాయి.. అనే వివరాలు విచారణలో బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తాండవ నదిలో బాలుడు గల్లంతు


స్వరాజ్(ఫైల్)

తుని రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో తాండవ నదిలో 11 ఏళ్ల బాలుడు గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. తుని పట్టణంలోని రాజీవ్ గృహకల్పకాలనీకి చెందిన మాకిరెడ్డి స్వరాజ్ (11), బావిశెట్టి గణేష్ (14) బుధవారం ఉదయం తుని శివారు కాత్రావుల వద్ద తాండవ నదిలో స్నానానికి దిగారు. ఇద్దరు బాలురు గల్లంతవుతుండగా ఇది గమనించి స్థానికులు ఒకరిని కాపాడారు. మాకిరెడ్డి స్వరాజ్ (11) అనే బాలుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ స్వరాజ్ ఆచూకీ ల భించకపోవడంతో అతడి కుటుంబ సభ్యు లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


తాండవ నదిలో గాలింపు దృశ్యం

సెపక్‌తక్రా జట్టు రాష్ట్ర కోచ్‌గా గౌతమ్


యాండ్ర గౌతమ్

అమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 27వరకు సీనియర్ పురుష, మహిళల జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలు గోవాలోని మాగ్దోస్ ప్రాంతంలో జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రం తరఫున పురుష జట్టు కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కానిస్టేబుల్, ఎన్ఐఎస్ కోచ్ యాండ్ర గౌతమ్‌ను నియమించినట్టు కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు ఈ మేరకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

యానాంలో భారీ వర్షం

రోడ్లు జలమయం

యానాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. భారీఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం, ఈదురుగాలులతో పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సమీపంలో వర్షంనీరు నిలిచిపోయింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. పిల్లారాయస్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ముంపు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్ అధికారులతో కలసి పర్యవేక్షించారు.


వర్షం నీటిలో వెళ్తున్న విద్యార్థులు

అన్నక్యాంటీన్ నిర్మాణ పనుల పరిశీలన

కాట్రేనికోన, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలో అన్నక్యాంటీన్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చెయ్యాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం ప్రారంభం

- గ్రామాల్లో భక్తుల సందడి
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం

అమలాపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర కార్తీక మాస ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా విఘ్నేశ్వరునికి కొండా దుర్గాసాయిప్రకాష్ దంపతులు అష్టద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్ విగ్రహాలకు నూతన వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూజాభిషేకాలకు ఆలయ పురోహితులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వం వహించారు. ఆలయ ధర్మకర్త పిచ్చిక వెంకన్న-ఇందిరాదేవి, చింతా అత్తిలింగం-వీరభద్రమణి, చింతా శంకరమూర్తి-చంద్రకళ, లక్కింశెట్టి నాగమల్లేశ్వరరావు-భ్రమరాంబ, పడవల తాతారావు, కొండా శ్రీనివాసరావు, యినుమర్తి లింగమూర్తి, చింతా ఉమా, గోళ్ల మల్లేశ్వరరావు దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): శివ, కేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలు, వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. బుధవారం ఉదయం నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, కేశవస్వామి ఆలయం, విశ్వేశ్వరాలయం, ముక్తేశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం, నల్లచెరువులోని శ్రీపద్మావతి సమేత అలివేలుమంగా సమేత శ్రీవేంకటేశ్వరాలయాలను భక్తులు సందర్శించారు.అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్పస్వాములు అభిషేకాలు జరిపించుకున్నారు. క్యూలైన్లు, ఆలయ మండపాలు భక్తులతో కిటకిటాలాడాయి. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని బుధవారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయం, మొండెపులంక శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో కార్తీక దీపారాధనలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. నరేంద్రపురం, కుందాలపల్లి, బెల్లంపూడి, మానేపల్లి, ముంగండ, ఉడిమూడి, గంటి పెదపూడి గ్రామాల్లో శివాలయాలు వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామున ఆలయాలకు వెళ్లి అభిషేకాలు చేయించుకుని శివనామస్మరణ చేశారు. బి.దొడ్డవరం గ్రామంలోని శ్రీఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. దీనిలోభాగంగా విఘ్నేశ్వరపూజ, సోమేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, ఉమాదేవికి లక్ష కుంకుమార్చన, లక్ష మారేడు దళాలతో అర్చన, నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఘనంగా జరిపారు. అలాగే మగటపల్లిలోని శ్రీ పార్వతీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ ఘనంగా జరిగింది.


మామిడికుదురు: బి.దొడ్డవరంలోని లక్ష బిల్వార్చన పూజ నిర్వహిస్తున్న భక్తులు

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలిరోజు క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వరస్వామి, మోరి ఉమాలింగేశ్వర స్వామి ఆలయం, అంతర్వేది కొత్తవంతెన వద్ద శివాలయాల్లో భక్తులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించుకుని దీపాలు వెలిగించారు. నందీశ్వరుడు, ధ్వజస్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. కార్తీకమాసం ప్రారంభం రోజే కాల్వలు, గోదావరి, సముద్రతీర ప్రాంతాల్లో దీపాలు వదిలారు.

వర్షాలకు పారిశుధ్యం క్షీణించకుండా చర్యలు చేపట్టండి

అంతర్వేది, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది, మండలస్థాయి అధికారులతో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నెల రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పారిశుధ్యం క్షీణించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. తక్షణమే పంచాయతీలు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంజన్ల సాయంతో ఇళ్ల చుట్టూ, రోడ్లపై చేరిన ముంపు నీటిని లోతట్టు ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు, మహిళా సంఘాలు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, కూటమి శ్రేణులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

ఏడో రోజుకు నిరాహార దీక్షలు

అమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. చెత్తను సేకరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన నిరాహార దీక్షకు ఎంపీటీసీలు గుత్తుల జానకీలక్ష్మి, అంకం హిమభారతి పాల్గొన్నారు. వార్డు సభ్యుడు కూర్మ క్రీస్తుబాబు ఆధ్వర్యంలో జరిగిన దీక్షలో ఏడో రోజు వార్డు సభ్యులు లక్కింశెట్టి వీరసూర్యం, మాడా కార్తీక్, గోళ్ల భాస్కరరావు, పళ్ల చలపతిరావు, ఉప్పు వీరయ్య, బళ్ల చలపతిరావు, ఉప్పు వీరయ్య, కూర్మ తాతారావు పాల్గొన్నారు. బాసిన బూర్గారావు, కాశిన నాగేశ్వరరావు, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మావూరి సాంబశివరావు, చింతా సూరిబాబు, చింతపట్ల ఓంనమశివాయ, కాశిన పద్మావతి, మాడా తిలక్, సరెళ్ల రామకృష్ణ, గుత్తుల మురుగులరావు, భోజనపల్లి ప్రసాద్, వాసా దొరబాబు, గుత్తుల సత్తిబాబు, కాలెపు శ్రీనివాసరావు, యినుమర్తి లింగమూర్తి, జాన కామేశ్వర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు.


నిరాహార దీక్షలు చేస్తున్న ప్రజలు

సస్పెన్స్‌క్రైమ్

థ్రిల్లర్‌గా విద్రోహి: దర్శకుడు

అల్లవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వీఎస్వీ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'విద్రోహి'సినిమా ఈనెల24న విడుదలవుతుందని నిర్మాత, దర్శకుడు వెంకట సుబ్రహ్మణ్యం విజ్ఞన తెలిపారు. శివకుమార్, చరిష్మ హీరో, హీరోయిన్లుగా, రవిప్రకాష్, శ్రీకర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న విద్రోహి సినిమా పోస్టు ప్రొడక్షన్ పూర్తిచేసుకుందన్నారు. ఫస్ట్‌లుక్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేయగా పాటలను వీవీ వినాయక్, ఆర్పీ పట్నాయక్ విడుదల చేశారన్నారు. ట్రైలర్‌ను కామెడీ కింగ్ అల్లరి నరేష్ ఆవిష్కరించారని వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. తాగుబోతు రమేష్, మధునందన్, కోటేశ్వరరావు, జబర్దస్త్ బాబీ, రణవీర్‌సాయి, కర్ణ, నవకీత్ పాటిల్, రాఘవేంద్ర, పప్పుల అన్వేష్, డీజే, మణమ్మ, దియా, మాధురి, ఆర్జే నాయుడు, సానియా, కృష్ణారావు, తడివేలు తదితర తారాగణంలో విద్రోహిలో నటించారన్నారు. ఫైట్స్ డ్రాగర్ ప్రకాష్, మ్యూజిక్ బీమ్స్ సిసిరోలియా సమకూర్చారన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు గొల్లవిల్లి విద్యార్థినులు


విద్యార్థినులతో హెచ్ఎం కనకదుర్గ

ఉప్పలగుప్తం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9,10 తరగతి విద్యార్థినులు ఈనెల22 నుంచి 24వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ అండర్-19 ఎస్జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. పండు దివ్యలేఖన, గాలిదేవర యశస్విని, పాలకొల్లు హనీ, సీహెచ్ బేబీ, బి.సౌభాగ్య, సీహెచ్ నందిని 13క్రీడాంశాల్లో ప్రథమ స్థానాలు సాధించారన్నారు. ఉమ్మడి జిల్లా కోచ్‌గా డి.సరస్వతి వ్యవహరిస్తున్నారు. విద్యార్థినులను హెచ్ఎం కనకదుర్గ, వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అరిగెల నానాజీ, పీఎంసీ చైర్మన్ వేలా సత్యనారాయణ, వై.సత్యశ్రీ, పీడీలు గొలకోటి ఫణీంద్రనాధ్, టి.సునీత, వి.విజయ భాస్కర్ అభినందించారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి రేకు అమరిక



పి.గన్నవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మొండెపులంక శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.5లక్షల దాతల విరాళాలతో ధ్వజస్తంభానికి ఇత్తడి రేకును అమర్చారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

కుండలేశ్వరుని సన్నిధిలో ప్రజాప్రతినిధులు



కాట్రేనికోన, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ బుధవారం కుండలేశ్వరాస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో అన్నదాన పథకాన్ని ప్రారంభించి, భక్తులకు భోజనం వడ్డించారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, త్సవటపల్లి నాగు, పీఎస్ఎన్ రాజు, గంగుమళ్ళ బాబ్జి, త్సవటపల్లి శ్రీను, పెసింగి ధర్మారావు, గంగుమళ్ళ నిరంజనరావు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రచ్చబండ

అల్లవరం,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లో బుధవారం కోటి సంతకాల్లో భాగంగా రచ్చబండ నిర్వహించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్,సర్పంచ్ కొల్లు వెంకటరమణ, చింతా రామకృష్ణ, కర్రిశ్రీను, చదళ్ల వాసుదేవుడు, గుంటూరి సత్యనారాయణరాజు, ఈతకోట సతీష్, బళ్ల శ్యామ్, పశ్చిమాల లీలాప్రసాద్, పశ్చిమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చందన మోహనరావు మృతికి నివాళులు

అమలాపురంరూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త, విద్యావేత్త చందన మోహనరావు మృతికి బండారులంక దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించింది. బుధవారం బండారులంకలో జరిగిన కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీశైలందేవస్థానం మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో మోహనరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ చింతపట్ల గంగా సత్యనారాయణ, బళ్ల మల్లేశ్వరరావు, ఆశపు చిన్నీ, జాన గణేష్, మావూరి సాంబ, చింతా పల్లపరాజు, మావూరి భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీ

అంబాజీపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా బుధవారం తనిఖీ చేశారు. నాగాబత్తులవారిపాలెం ఎంపీపీ పాఠశాలలో, కె.పెదపూడి హైస్కూల్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కె.పెదపడి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులను ఆయన పలు ప్రశ్నలు అడిగారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అంబాజీపేట సెయింట్ మేరీ పాఠశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

అమలాపురం రూరల్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి క్షత్రియ కల్యాణ మండపంలో యంగ్ రెబల్‌స్టార్ ఉప్పలపాటి ప్రభాస్‌రాజు పుట్టినరోజు వేడుకలు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు దెందుకూరి సత్తిబాబురాజు, కడలి వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, ఈతకోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూలు గేమ్స్ పోటీల్లో ప్రతిభ

అమలాపురం టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్కూలుగేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు కస్నెపాముల సత్య, కాట్రు చాణుక్య, గుండే ప్రతాప్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, కెఆర్ఎం ప్రసాద్, కేవీవీ సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, కర్రా శ్రీనివాసరావు, కె.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఆరోపణలకు బదులివ్వడానికి సిద్ధం: మల్లాడి



యానాం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిఎంపీ వి.వైద్యలింగం ఇటీవల తనపై చేసిన ఆరోపణలకు బదులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పుదుచ్చేరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కమీషన్ తీసుకున్నానని, సీఎస్ఆర్ నిధుల్లో అవినీతికి పాల్పడ్డానని వైద్యలింగం చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వడానికి, అలాగే వైద్యలింగంపై తాను చేసిన ఆరోపణలకు సాక్ష్యాధారాలతో రుజువు చేయడానికి పుదుచ్చేరిలో సిద్ధంగా ఉన్నానన్నారు. బుధవారం ఉదయం తర్వాత ఎక్కడకు రమ్మన్నా సిద్ధంగా ఉన్నానన్నారు. తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయడానికి వైద్యలింగం, నారాయణస్వామి, వైద్యనాథన్ సిద్ధమేనా అని ప్రశ్నించారు.

మహాలింగార్చన పూజా కార్యక్రమాలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ఉప్పలగుప్తం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్యఅగ్రహారంలో 12వవార్షిక కార్తీక మాస మహాలింగార్చన పూజా కార్యక్రమాలను కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు. ప్రతిరోజు మట్టితో 365 శివలింగాలను తయారుచేసి మహాలింగార్చన పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్టు ఉత్సవ కర్త ముస్నంగి రామకృష్ణశర్మ మంత్రికి వివరించారు. మంత్రి సుభాష్ మహాలింగార్చన పూజలు చేశారు. మంత్రికి వేదాశీర్వచనం అందించి, చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు. తొలుత మంత్రికి గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్, ఉత్సవకర్త రామకృష్ణశర్మ, వేదపండితులు పూర్ణకుంభతో స్వాగతం పలికారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం

మలికిపురం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు సీఎస్సార్ నిధులు రూ.5లక్షలతో మట్టపర్రులో ఏర్పాటుచేసిన మంచినీటి ట్యాంకును బ్యాంకు మేనేజర్ మహ్మద్ అమీర్‌అలీ బుధవారం ప్రారంభించారు.

ఘనంగా నరసింహస్వామి జన్మ నక్షత్ర పూజలు


స్వాతి నక్షత్ర పూజ సందర్భంగా 108 కలశాలను సిద్ధంచేసిన అర్చకులు

అంతర్వేది, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామివారి కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం 108కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం జరిపారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను వైభవంగా జరిపించారు.

అదుపులో శాంతిభద్రతలు.. గంజాయిపై నిఘా: ఎస్పీ


అల్లవరం స్టేషన్‌లో ఎస్పీ మీనా

అల్లవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, క్రైమ్ రేటు పెరగలేదని ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. అల్లవరం పోలీసుస్టేషన్‌ను బుధవారం రాత్రి తనిఖీ చేశారు. జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో గంజాయి రవాణాపై నిఘా కొనసాగిస్తున్నామన్నారు. జూదాలు, బహిరంగ మద్యపానం జరగకుండా పటిష్టమైన బందోబస్తు కొనసాగిస్తున్నామన్నారు. అల్లవరం పోలీసుస్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):వరదలు వస్తే మూడు లంక గ్రామాల ప్రజల కష్టాలు గట్టెక్కనున్నాయి. అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిధులు సాధించారు. బీసీఆర్ఎఫ్ నిధులతో 6.3కిలోమీటర్ల సీసీరోడ్డు, బీటీరోడ్డుకు, కాజ్‌వే నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేస్తారు. కాజ్‌వే నిర్మాణం పూర్తయితే లంక గ్రామాలైన అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజల అవస్థలు తీరనున్నాయి. వరదలు వస్తే ఆయాగ్రామాల ప్రజలు నాటు పడవలపై ప్రయాణించి అవస్థలు పడుతున్నారు. కష్టాలన్నీ గట్టెక్కుతాయని లంక గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుతో పాటు కాజ్‌వే నిర్మాణానికికృషిచేసిన ఎమ్మెల్యేను ప్రజలు అభినందించారు.

శరణు ఘోషతో మార్మోగిన అప్పనపల్లి

మామిడికుదురు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాముల శరణ ఘోషతో అప్పనపల్లి మంగళవారం రాత్రి మార్మోగింది. అప్పనపల్లిలో గొడవర్తి రాజా ఆధ్వర్యంలో గొడవర్తి శ్రీనివాస్ పర్యవేక్షణలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామికి పడిపూజ ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, సుబ్రహ్మణ్యస్వామి పూజ, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలుచేసి అనంతరం అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 కుందుల్లో కర్పూరం వెలిగించి స్వాములు చేసిన నృత్యం ఆకట్టుకుంది. అయ్యప్పస్వామికి సహస్రనామార్చన పూజా ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వాములు నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

అమ్మవారి ఆలయంలో చోరీ

ముమ్మిడివరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సూరాయిచెరువు శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు పడి అమ్మవారి మెడలోని అరకాసు బంగారు సూత్రాలు అపహరించుకుపోయారు. తాళాలు తొలగించి ఈచోరీకిపాల్పడినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

లారీ ఢీ: విద్యుత్ స్తంభం ధ్వంసం

అంబాజీపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారు పోతాయి లంకలో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టడంతో మధ్యలోకి విరిగిపోయింది. దీంతో విద్యుత్ తీగలు ధ్వంసమయ్యాయి. నిత్యం వందలాది మంది తిరిగే ప్రాంతంలో ఈప్రమాదం జరగడంతో భయాందోళన నెలకొంది. విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించారు.

డిప్యూటీ మండల అభివృద్ధి అధికారిగా సుబ్రహ్మణ్యం



ముమ్మిడివరం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం మండలపరిషత్ డిప్యూటీ అభివృద్ధి అధికారిగా పీవీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరప మండలం యండమూరుగ్రామ పంచాయతీ గ్రేడ్-1 సెక్రటరీగా పనిచేసిన సుబ్రహ్మణ్యం పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, కోలా బాబ్జి, మండలపరిషత్ అధికారి జేఎల్ఎన్ దీక్షితులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు స్వాగతంపలికి అభినందనలు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ



ఉప్పలగుప్తం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో డి.కృష్ణకు ఆయన నియామక పత్రాలు అందించారు.

సమ్మె నోటీసు అందజేత

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ కార్మికులు బుధవారం కమిషనర్ పి.రవివర్మకు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నవంబరు 3నుంచి సమ్మె చేపట్టడంతో దీనిలో భాగంగా బుధవారం నగర పంచాయతీ కార్మికులు కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే తదితర డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, వనచర్ల విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, బుంగ కుమారస్వామి, పలివెల రాంబాబు, కాకి రాంబాబు, మహాలక్ష్మి, బుంగ లక్ష్మణ్, దొండపాటి సతీష్, రేవు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామికి వెండి చామరం బహూకరణ

మామిడికుదురు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వాడపాలేనికి చెందిన కుకునూరి దీపు రూ.32వేలు విలువైన 107 గ్రాముల వెండితో చేయించిన చామరాన్ని బహూకరించారు. చామరాన్ని ఆలయ పర్యవేక్షకుడు బొక్కా సత్యంమూర్తికి అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. దాతను ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు అభినదించారు.

మళ్లీ మొరాయించిన ఓఎన్జీసీ భారీ వాహనం

మలికిపురం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం కూడలిలో ఓఎన్జీసీకి చెందిన భారీవాహనం మళ్లీ నిలిచిపోయింది. రాజోలు వైపు నుంచి వచ్చిన ఈభారీ వాహనం మంగళవారం బట్టేలంక కూడలిలో నిలిచిపోగా అతి కష్టం మీద ఓఎన్జీసీ క్రేన్‌తో చేపట్టిన చర్యలతో వాహనం ముందుకు కదిలింది. 18చక్రల భారీ వాహనంపై ఓఎన్జీసీ రిగ్‌ను తూర్పుపాలెం తీసుకువెళ్తన్నారు. మళ్లీ శంకరగుప్తంలో ఈవాహనం నిలిచిపోయింది. ఈనేపథ్యంలో ఓఎన్జీసీ అధికారులు ముందుకు పంపడానికి కుస్తీ పడుతున్నారు.

వదలని వర్షం

మలికిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రతీరోడ్డు ముంపు బారిన పడింది. గ్రామాల్లో రోడ్లలన్నీ గోతులు పడి ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది. అధికారులు పారిశుధ్యం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దొరబాబుకు పరామర్శ


పార్వతీదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్

కాట్రేనికోన, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న రంబాల దొరబాబును బుధవారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కె ప్రసాద్ పరామర్శించారు. దొరబాబును, ఆయన కుటుంబ సభ్యులను కాట్రేనికోన ఎస్ఐ అవినాష్, రెడ్డి సంఘం రాష్ట్ర నాయకుడు ఆనందరెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కంచుస్తంభం సోనీ, పశ్చిమ గోదావరి జిల్లా వైశ్య సంఘం నాయకుడు శ్రీధర్, కపిలేశ్వరపురం జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు తదితరులు పరామర్శించారు.

అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం

ముమ్మిడివరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి బుధవారం ముమ్మిడివరంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామిని పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అయ్యప్పస్వాములు పవిత్ర నదీ జలాలను సేకరించేందుకు పేటతుళ్లై ఆడుతూ అయ్యప్ప శరణుఘోషతో మేళతాళాలు, భజాభజంత్రీలతో తరలివెళ్లారు. అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

నూరుశాతం విద్యార్థులు హాజరుకావాలి

ముమ్మిడివరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్యను నూరు శాతానికి పెంచాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ సూచించారు. అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎంసీశ్రీ స్కూలును బుధవారం సందర్శించారు. పదో తరగతి గణితంలో విద్యార్థుల ఎఫ్ఏ2 ఎసెస్‌మెంట్ బుక్‌లెట్లను పరిశీలించారు. విద్యార్థులు ప్రశ్నలకు ఏవిధంగా సమాధానాలు రాస్తున్నారో పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. పీఎంసీశ్రీ వర్కులో ఇచ్చిన నిధులు పూర్తి స్థాయిలో వినియోగించడంతో పాటు పనులు నాణ్యతతో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలో ఒకేషనల్ ఇనస్పెక్టర్ల ల్యాబ్ పనితీరును సందర్శించారు, వారికి పలు సూచనలిచ్చారు. ఆమె వెంట సీఎంవో టీవీ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి రాయుడు ఉదయభాస్కరరావు, క్లస్టర్ రిసోర్సుపర్సన్లు, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా సుబ్బారావు

ముమ్మిడివరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ అయినాపురం గ్రామకమిటీ అధ్యక్షుడిగా యనమదల సుబ్బారావు ఎన్నికయ్యారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గ్రామ కమిటీ చురుగ్గా పనిచేయాలని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అమలుచేసే పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే వేమా పరామర్శ

పి.గన్నవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉడిమూడిలో భర్త చాకుతో కంటిపై దాడి చేయడంతో గాయపడ్డ పల్లాలమ్మకు కాకినాడ జీజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేశారు. బుధవారం ఆమెను జీజీహెచ్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా నాయకులు చీకురుమిల్లి శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు పరామర్శించారు.

గ్రామసభల ద్వారా ఉపాధిహామీ పనులు గుర్తింపు

మామిడికుదురు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పనులను గుర్తిస్తున్నట్టు ఏపీవో ఆర్.రమేష్‌బాబు తెలిపారు. నగరం పంచాయతీ వద్ద ఉపాధిహామీ గ్రామసభ సర్పంచ్ జాలెం రమణకుమారి అధ్యక్షతన జరిగింది. ఈసభలో ఏపీవో మాట్లాడుతూ ఈఏడాది 7500 పని దినాలకు ఇప్పటివరకు 5706 పనిదినాలు కల్పించామన్నారు. గ్రామంలో 318మందికి జాబ్‌కార్డులు ఉండగా 130మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని, ఉపాధిహామీ ద్వారా 35పనులను నగరం గ్రామంలో గుర్తించినట్టు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరపరెడ్డి సురేష్, ఉపసర్పంచ్ ఏటీ హుస్సేన్, జేఈ పి.సునీత, టీఏ జవ్వాది కృష్ణ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

మలికిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధికారులకు సూచించారు. ఇళ్ల మధ్యకు నీరు చేరడం, చెత్త తొలగించకపోవడం వంటి కారణాలతో పారిశుధ్యం క్షీణించి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ప్రతీ పంచాయతీ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు, రాజకీయ నాయకులు, మహిళా సంఘాలు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామ పంచాయతీకి చెందిన 50శాతం సాధారణ నిధులు, 30శాతం 15వ ఆర్థికసంఘం నిధులు పారిశుధ్యానికి ఖర్చు చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు.

విద్యుత్ హైఓల్టేజీతో కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు

అల్లవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని సుంకరవారి వీధివద్ద 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం రాత్రి హైఓల్టేజీతో మంటలు చెలరేగి ఇళ్లల్లోని ఫ్యాన్లు, టీవీలు, స్టెబిలైజర్లు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో హైఓల్టేజ్ ఏర్పడి పది ఇళ్లకు నష్టం ఏర్పడింది.

12వ రోజుకు చేరిన దీక్షలు

ముమ్మిడివరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండులోకి రాకపోకలను పునరుద్ధరించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్‌చేస్తూ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని నాయకులు పీవీ సత్యనారాయణరావు, గోడి సత్యనారాయణ, బాలరాజు, గుత్తాల రమణ, జి.క్రాంతి, కె.సాగర్, కన్నీడి వెంకటరమణలతో పాటు పలువురు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆర్టీసీ బస్టాండులోని ఆక్రమణలు తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

బాలాజీస్వామికి వెండి చామరం బహూకరణ

మామిడికుదురు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వాడపాలేనికి చెందిన కె.దీపు వెండి చామరాన్ని బహూకరించారు. ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యంమూర్తికి దాన్ని అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందించారు. దాతను ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు అభినందించారు.



ఆలమూరు విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి



మండపేటలోని ఏడిద సంఘమేశ్వర ఆలయంలో స్వామివారికి పూజలు



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న శివస్వాములు

కైలాసవాసా నమో నమః

• భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట • ప్రారంభమైన కార్తీకమాసం పూజలు • ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

ఆలమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పూజలు ఆలమూరులో ఘనంగా ప్రారంభమయ్యాయి. శైవక్షేత్రాలకు నిలయంగా ఉన్న మండలంలోని పలు ఆలయాలకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో కిటకిటలాడాయి. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, మూలస్థానంలోని మూలేశ్వరస్వామి, చింతలూరులోని పృధీశ్వరస్వామి, మడికిలోని సోమేశ్వరస్వామితోపాటు పురాతన ఆలయాలుగా పేరొందిన జొన్నాడ, చొప్పెల్ల, మడికి, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, సంధిపూడి, పినపళ్ల, కలవచర్ల గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే కార్తీకమాస పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు తెల్లవారుజామునే ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో మండలంలోని ఆయా శైవక్షేత్రాల్లో బుధవారం కార్తీకమాసం పూజలు ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలుగా పేరొందిన సోమేశ్వరం బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పండు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. వెంటూరు పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, వెదురుపాక సోమేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి, వి.సావరం బీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ర్యాలిలో శివదీక్షలు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ర్యాలిలో సుమారు 60 మంది శివమాల దీక్షధారణ చేపట్టారు. కార్తీకమాసం తొలిరోజు బుధవారం ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితో పాటు శివమాల ధరించిన సుమారు 20 మంది అభిషేకాలు నిర్వహించుకుని మాలధారులు శివదీక్షను చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ చేశారు. ఆయా శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకోగా, ప్రసిద్ధి శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

మండపేట(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభరోజు బుధవారం మండపేటతో పాటు రూరల్‌లో వున్న శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మారుమోగాయి. వేకువజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తొలిరోజు కావడంతో ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రథంగుడి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. మండపేట మండలం ఏడిదలో వున్న పురాతన సంగమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు శర్మసారధ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ద్వారపూడి, అర్తమూరు, కేశవరం, తాపేశ్వరం, వెలగతోడు, పాలతోడు, మారేడుబాక తదితర గ్రామాల్లోని ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాలను దర్శించుకున్న భక్తజనం ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

దీపాలతో మహిళల సందడి

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమవడంతో మండలంలోని ఆయా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు ఆయా ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. కోటిపల్లి గోదావరి నదిలో స్నానాలు చేసి ఛాయాసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. మండలంలోని యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, దంగేరు, యర్రపోతవరం, బాలాంత్రం, మసకపల్లి, భట్లపాలిక, కందూరు గ్రామాల్లోని శివాలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

కొత్తపేటలో సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

కొత్తపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం కాబోతోంది. యుద్ధ ప్రాతిపదికన దీన్ని ప్రారంభించేందుకు వాటి పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇటీవల వీటి పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు.

ఉపాధి పనుల గుర్తింపునకు రేపటి నుంచి గ్రామసభలు


ఆలమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు 24వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.రాజు, ఏపీవో అరుణకుమారి తెలిపారు. శుక్రవారం నాడు పెదపళ్ల, మడికి, 28న పినపళ్ల, బుడుగువానిలంక, 30న సంధిపూడి, మోదుకూరు, నవంబరు 3న చింతలూరు, చొప్పెల్ల, 6న ఆలమూరు, జొన్నాడ, 7న సూర్యారావుపేట, పెనికేరు, 10న కలవచర్ల, నర్సిపూడి, 12న మడికి, నవాబుపేట, గుమ్మిలేరు, 13న చెముడులంక, మూలస్థానం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించి అధికారులు, ప్రజలు, నాయకుల సమక్షంలో ఉపాధి పనులు చేపట్టాల్సిన వాటిని గుర్తిస్తామని వారు తెలిపారు.



మెయిన్ రోడ్డులో చెట్టుకొమ్మను ఢీకొట్టిన కంటైనర్

చెట్టుకొమ్మను ఢీకొట్టిన కంటైనర్

ఆలమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో చెట్టుకొమ్మను కంటైనర్ ఢీకొట్టడంతో కొమ్మ విరిగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జొన్నాడ వైపు నుంచి పినపళ్లలోని పేపర్‌మిల్లుకు వెళుతున్న ఖాళీ కంటైనర్ రోడ్డు గోతుల వల్ల పక్కకు వెళ్లడంతో పక్కనున్న చెట్టుకొమ్మను ఢీకొట్టింది. దీంతో అది రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తింది. స్థానికులు చెట్టుకొమ్మను పక్కకు నెట్టడంతో సమస్య పరిష్కారమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులన్నారు.



ఘనంగా నరసింహస్వామి జన్మ నక్షత్ర పూజలు

అంతర్వేది, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వాతి నక్షత్ర పూజలను నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామివారి కలశాలను శిరసుపై ధరించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం జరిపారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను జరిపించారు.

విసుగు చెందారు...రోడ్డు వేసుకున్నారు

• అధికారుల ఉదాశీనతపై అసంతృప్తి • రూ.2లక్షలతో రోడ్డు నిర్మాణం

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారు...ఏదో చేస్తారు...అని ఎదురు చూడకుండా రైతులే రోడ్డును నిర్మించుకున్నారు. ఆత్రేయపురం బుల్లిపేట నుంచి వాడపల్లి వెళ్లే లింక్ రోడ్డు నుంచి ఏటిగట్టుకు వెళ్లే రహదారి కొన్నేళ్ల క్రితం నిర్మించారు. అక్కడ నుంచి రజకపేట స్మశానానికి వెళ్లే కాలువగట్టు సుమారు 600 మీటర్లు మట్టి రోడ్డు ఉండడంతో కొద్దిపాటి వర్షానికే బురదగా మారుతోంది. దీంతో రైతులు పండించే ఉత్పత్తులను తరలించేందుకు ఇబ్బందిగా మారింది. రైతుల మొర ఆలకించే వారు లేకపోవడంతో విసుగు చెంది సుమారు రూ.2లక్షలతో గ్రావెల్ రోడ్డును నిర్మించుకుని తమ సమస్యను పరిష్కరించుకున్నారు.



వాడపల్లిలో రైతులు నిర్మించుకున్న రహదారి



మండపేటలో పెట్రోలు బంక్‌ను తనిఖీ చేస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, అగ్నిమాపక శాఖ అధికారి

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మండపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేటలోని పలు పెట్రోలు బంకులను రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, పట్టణ సిఐ సురేష్, అగ్నిమాపక శాఖ అధికారులతో బుధవారం తనిఖీ చేశారు. బైపాస్ రోడ్డులో వున్న పెట్రోలు బంకుతోపాటు మారేడుబాకలో వున్న పెట్రోల్ బంకుల్లో తనిఖీలను నిర్వహించి పరిశీలించారు. బంకుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులను ఆయన హెచ్చరించారు. ఆయా బంక్ యజమానులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట పట్టణ సీఐ సురేష్, ఫైర్‌స్టేషన్ అధికారి హనుమంతరావు తదితరులు వున్నారు.

కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

రావులపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం రావులపాలెంలోని కాంట్రాక్టర్ల బిల్డింగ్ భవనంలో అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎస్ రెడ్డి, రాష్ట్ర చైర్మన్ పి.శేషగిరిరావు, జాతీయ కార్యదర్శి సీహెచ్ రామకోటయ్య, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌వీ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రి తాతారెడ్డి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి పనులు నిలుపుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు వస్తాయనే నమ్మకంతో వాటి పనులు పూర్తి చేశామన్నారు. తమ ఇబ్బందులపై సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌లకు వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో తీర్మానించామన్నారు. కార్యక్రమంలో రావులపాలెం చైర్మన్ చండీకేశవరెడ్డి, తణుకు చైర్మన్ వీ.సతీష్‌చౌదరి, తాడి నాగమోహనరెడ్డి, రాష్ట్ర నాయకులు పంకజ్‌రెడ్డి, వల్లభనేని వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, రాఘవరావు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, చింతా నాగిరెడ్డి, పి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

చదువుతోపాటు క్రీడల్లోనూ... విద్యార్థులు మమేకం కావాలి



రాయవరంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఉండవిల్లి రాంబాబు అన్నారు. బుధవారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో-2 వై.సూర్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం అండర్-14, అండర్-17 బాలురు, బాలిక విభాగంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీ ల్లో బాలుర, బాలికల విభాగాల్లో 35 మంది క్రీడాకారులను 23న జరిగే డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

బాణసంచా మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు అందజేయాలి

మండపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాయవరంలో ఇటీవల బాణసంచా ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు ప్రకటించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు సాయం అందించడంతోపాటు, అర్హులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. వారి పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మొక్క నాటుతున్న మంత్రి సుభాష్

ప్రకృతిని కాపాడుకుందాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మనిషి మనుగడకు వృక్ష సంపద అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలునాటి ప్రకృతిని కాపాడుకోవాలని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకుని పసలపూడి బైపాసు రోడ్డు జంక్షన్ నుంచి వీఎస్ఎం కళాశాల వరకు జరిగిన కార్యక్రమంలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈఈ శ్రీకాంత్, ఏఈ సునీల్, ఎస్‌కెబీపీ ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కూటమి నాయకులు కంచుమర్తి బాబూరావు, కవల నానాజీ, నారపురెడ్డి బలరామ్, జాస్తి విజయలక్ష్మీ, వైట్ల గజలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ హైఓల్టేజ్‌కు కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు

అల్లవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని సుంకరవారి వీధి వద్ద 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం రాత్రి హైఓల్టేజ్‌తో మంటలు చెలరేగి ఇళ్లల్లోని ఫ్యాన్లు, టీవీలు, స్టెబిలైజర్లు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో హైఓల్టేజ్ ఏర్పడి పది ఇళ్లకు నష్టం ఏర్పడిందని స్థానికులు పలువురు వాపోయారు.

కేశవస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం భక్తజన సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయిదు బుధవారాలు, ఐదు ప్రదక్షిణలు జరిపితే కోరిన కోర్కెలు నెరవేరుతున్నాయని ఆయా భక్తులంటున్నారు. దీంతో భక్తజనం స్వామివారికి ఐదు బుధవారాల ప్రదక్షిణ మొక్కును తీర్చుకుంటున్నారు. మాలధారణ చేపట్టిన అయ్యప్పభక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రదక్షిణలు నిర్వహించారు. స్వామివారి క్షేత్రంలో సేవ చేస్తున్న 50 మంది మహిళా సేవకులకు యూనిఫాం అందజేశారు. నిత్యాన్నదాన పథకం ద్వారా భక్తులకు అన్నప్రసాదం జరిపారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. హైదరాబాద్‌కు చెందిన అన్నాబు మురళీమోహన్, దివ్య దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

చిల్లర నాణేలతో తులాభారం: ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఎన్.బన్ని ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. దీంతో బుధవారం స్వామివారి ఆలయంలో 60 కిలోల చిల్లర నాణేలతో స్వామివారికి తులాభారం నిర్వహించుకుని మొక్కును చెల్లించారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని లొల్ల లాకులు, వాడపల్లి రివర్ ఫ్రంట్ రిసార్ట్స్, వాడపల్లి, మందపల్లి, పలివెల, ర్యాలి వంటి ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని బుధవారం విజయవాడలో ఏపీటీడీసీ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.శేషగిరిని కలిసి ఎమ్మెల్యే బండారు చర్చించారు. రాబోయే సంక్రాంతిని పురస్కరించుకుని ఆత్రేయపురంలో జాతీయస్థాయి బోట్ ఫెస్టివల్ నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. జాతీయస్థాయిలో పడవల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అవసరమైన అనుమతులు, టూరిజం అభివృద్ధికి ప్రభుత్వ సామాజిక భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. వీటికి సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.



టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్చిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు



క్రీడాకారిణి నిహారికకు చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

బాక్సింగ్ క్రీడాకారిణికి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి కారుమూరి నీహారికకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున ఆర్థికసాయం అందజేశారు. బుధవారం లయన్స్ కల్యాణ మండపంలో మంత్రి సుభాష్ చేతుల మీదుగా రూ లక్ష చెక్కును అందజేశారు. భవిష్యత్తులో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు ఆర్థికసాయం అందించారు. త్వరలో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆమె బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.

దాతృత్వం, సేవాగుణం కలిగి ఉండటం వరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దాతృత్వం, సేవాగుణం కలిగి ఉండటం వరమని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పురస్కార ప్రధానోత్సవంలో మంత్రి మాట్లాడారు. సమాజ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు అందరికీ ఆదర్శం కావాలన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సాటివారి కష్టాల్లో సాయపడటంలో ఉన్న సంతృప్తి మరెక్కడా దొరకదన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే అవకాశం దీని ద్వారా కలిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలను కొనియాడారు. పలు రూపాల్లో సేవలందిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కె రాజగోపాల నరసరాజు, వెల్ల కామెర్ల వైద్యుడు గుండుబోగుల లక్ష్మణరావు, చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్న పోలిశెట్టి చంద్రశేఖర్, రేవతి సైన్సు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పిశెట్టి శ్రీకృష్ణసాయి, డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన దివ్యాంగుడు కసిరెడ్డి సత్తిబాబు, అతని సోదరుడు సురేష్ సేవా పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లొల్లలో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

స్వదేశీ వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాయవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల కొనుగోలుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ పిలుపునిచ్చారు. బుధవారం లొల్ల గ్రామంలో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఆత్మనిర్భర్ భారత్ కోకన్వీనర్ కొత్తపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ భారతదేశ స్వయం సమృద్ధి సాధనకు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. మండలస్థాయి, బూత్‌స్థాయిలో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటా ఈకార్యక్రమంపై ప్రచారం నిర్వహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, శాకా దుర్గా శ్రీనివాస్, చీకురుపల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, వల్లభనేని రవీంద్రబాబు, బండారు సూరిబాబు, నరాల రాంబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వాతావరణం మార్పులతో రైతుల్లో ఆందోళన

కె.గంగవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రితో పాటు బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీనికితోడు ఈదురు గాలులు వీచడంతో వరి పంట నేలవాలిపోతోంది. మండలంలో సుమారు 16 వేలు ఎకరాల్లో వరి పంట సాగయ్యింది. ప్రస్తుతం వరి పంట కొన్ని పొలాలు ఈనిక దశ పూర్తి చేసుకుని, మరికొన్ని ఈనిక దశలో ఉన్నాయి. ఇప్పటికే ఈనిక పూర్తి చేసుకున్న వరి పొలాలు వెన్నుల బరువుతో ఈదురుగాలులు, వర్షాలకు పడిపోతున్నాయి. ఈనిక దశలో ఉన్న వరి పొలాలు పడిపోతే గింజ తోడుకోకుండా పొల్లు వస్తుందని రైతులంటున్నారు. పొట్టలోకి నీరు వెళ్లడం వలన పొల్లు వస్తుందని వారన్నారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఎక్కువగా ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈనెల 25న బంగాళాఖాతంలో అల్పపీడనం అని వాతావరణ శాఖ ప్రకటనలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.



కె.గంగవరం మండలంలో నేలకొరిగిన వరిపంట